# దేవుడు చేసిన పెళ్ళి

- కలవకుంట్ల గురునాథపిళ్లై

అనుకున్న ఆదివారం రానే వచ్చింది. బెంగుళూరులోని డైమండ్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో రేపే ఇంటర్వ్యూ. నేను ఎంబిఏ చదివాను. అమెరికాలో వున్న నా స్నేహితులు ఉద్యోగమిప్పిస్తాం అని చెప్పినా వారి ఆఫర్ సున్నితంగా తిరస్కరించాను. అమ్మానాన్నలను వదిలి ఉండడం నాకిష్టంలేదు. నిన్న రాత్రంతా ఒకటే కలలు. ఇంటర్వ్యూకెళ్లినట్లు, సెలెక్ట్ అయినట్టు, నా ఊహాసుందరిని వరించి పెళ్లాడినట్లు.

మాది మదనపల్లె. మా నాన్నగారు రామనాధంగారు మున్సిపాలిటీలో ఎలిమెంటరీ స్కూలు టీచరు. సర్వీసు మరో రెండేళ్ళుంది.

నేను ఇంటర్ చదివేటప్పుడు ఒకసారి అక్కా వాళ్లింటికి బెంగుళూరు వెళ్లాను. వాళ్లింట్లో ఆధునిక సౌకర్యాలన్నీ చూచి నాకెంతో సంతోషం వేసింది. వారికింకా పిల్లలు పుట్టలేదు. అదొక్కటే విచారించాల్సిన విషయం. బెంగుళూరు వెళ్లానంటే రెండు మూడురోజులైనా అక్క నన్ను రానివ్వదు.

ఆయనకు తెలియకుండా నా ఖర్చులకని అమ్మ ఐదువందలిచ్చింది. మదనపల్లె నుండి బెంగుళూరుకు దాదాపు నాలుగుగంటల బస్సు ప్రయాణం.

నేను బెంగుళూరు వెళ్తున్న ప్రైవేట్ బస్సెక్కాను. ఎక్కడ ప్రయాణికులు బస్సును ఆపినా అక్కడంతా ఆగుతూ వెళ్తున్నది. ప్రైవేటు బస్సెక్కడం నాతప్పనుకున్నాను. ఆ ప్రైవేటు బస్సు నా పాలిట వరంగా మారుతుందనే విషయం అప్పట్లో నాకు తెలియదు.

బస్సు బయటవైపు అటూ ఇటూ చూసాను. ఎటు చూసినా జనసంద్రమే. నాకెదురుగా రెండు పూల అంగళ్ళు కనిపించాయి. ఒక పూల అంగడి ముందు నిలబడి పూలు జడలో తురుముకుంటున్న అమ్మాయి నన్నాకర్షించింది. అమ్మాయి ఇటు తిరిగితే ఇంకెంత అందంగా వుంటుందో చూడాలని ఉత్కంఠతతో అటే చూస్తున్నాను. ఆవిడ ఎందుకో ఒకసారి బస్సు వైపు తిరిగి చూసింది. సన్నని తుంపరులు రాలుతుండగా హరివిల్లు కనిపిస్తే ఎంత అందంగా వుంటుందో అంత అందంగా వుందామె. ఉన్నట్టుండి ఆకాశంలో మెరుపు తీగను చూస్తే కళ్ళు బైర్లుకమ్మవూ! ఆమె ముఖారవిందం చూసాక అలాగే వుంది నా పరిస్థితి.

"బాబూ! నీపక్క సీటు ఖాళీగావుందా?" అని ఒకామె అడగడం విని అటు చూసాను. ఎవరో పెద్దావిడ వుంది.

"ఉందమ్మా" అన్నాను అనాలోచితంగా పూల అంగడివద్ద నిలబడివున్న అమ్మాయిని తిరిగి చూస్తూ.

"ఈ బ్యాగు అక్కడుంచు బాబూ!"

ఆవిడ అందించిన సంచీతీసి నా పక్కనే వుంచాను. ఆసరికే ఖాళీగావున్న సీట్లు నిండిపోయాయి. ఆ అమ్మాయి నేనున్న బస్సువైపే రావడం కనిపించింది. వచ్చి నాతో మాట్లాడిన పెద్దావిడతో ఏదో మాట్లాడింది. బస్సెక్కి నేనున్న సీటు వద్దకు వచ్చి సంచీ తీసి తన ఒడిలో వుంచుకుని ఒద్దికగా కూర్చుంది.

"ఎందాక ప్రయాణం బాబూ" మాటలు కలిపింది పెద్దావిడ క్రింది నుండే.

"బెంగుళూరుకమ్మా. ఇంటర్వ్యూ ఒకటుంది" అన్నాను.

"ఇంటర్వ్యూ డైమండ్ కంపెనీలో కాదుకదా!"

"అక్కడికేనమ్మా. అవునూ ఆ కంపెనీ పేరు మీకెలా తెలుసు?" ఆశ్చర్యంగా అన్నాను.

"మా అమ్మాయి బిటెక్ చదివింది బాబూ. ఆ కంపెనీ ఇంటర్వ్యూకు వెళ్తున్నది. జయనగర్‌లో నా కొడుకూ కోడలూ ఉన్నారు. మీరు బెంగుళూరు చేరేసరికి రాత్రి ఎనిమిది గంటలపైగా అవుతుంది. ఆడపిల్లకదూ. అడ్రస్ అమ్మాయి చెబుతుంది. శ్రమ అనుకోకుండా మా అమ్మాయిని అక్కడ దించి వెళ్లు బాబూ. నీకు పుణ్యముంటుంది" అంది పెద్దావిడ.

"సరే అలాగేనమ్మా. ఇందులో శ్రమ ఏముంది?" అన్నాను సంతోషంగా.

"బస్సు బయలుదేరేటట్టుంది తల్లీ. నీవేం బెంగ పడకు. అబ్బాయితో చెప్పానుగదా. తోడుండి మీ అన్నయ్య వాళ్లింట్లో దింపుతాడులే. భద్రం తల్లీ. నేనొస్తానమ్మా. వెళ్లొస్తా బాబూ" అంటూ వెళ్లిపోయింది.

***

బస్సు బయలుదేరింది. చల్లని పిల్లగాలులు కిటికీ గుండా బస్సులోనికి వీస్తున్నాయి. పక్కనున్న పిల్లగాలీ వీస్తున్నది. ఆమె జడలోని మల్లెల పరిమళాలు గుప్పుమంటున్నాయి. ఇద్దరం ఒకే కంపెనీలో ఇంటర్వ్యూలకు వెళుతున్నాం. ఇద్దరికీ ఉద్యోగాలు వచ్చాయెా, పరిచయాలు పెరుగుతాయి. పరిచయం ప్రేమగా మారుతుంది. ప్రేమ పెళ్లిగా పరిణమిస్తుంది. ఇలా వూహల్లో తేలిపోయాను. బస్సు కుదుపులకు ఒకరినొకరం ఒరుసుకుంటున్నాం. ఆవిడ స్పర్శ వెచ్చగా హాయిగొలుపుతున్నది. నాలో రక్తప్రసరణ హెచ్చింది. ఈ అనుభూతి చిరస్థాయిగా వుంటే... ఊహలతో పులకించిపోయాను. ఎంతసేపలా మూగగా కూర్చొను. మొదట నేనే మాట కలిపాను.

"హలో మిస్! మీ పేరేంటి?"



"సుప్రియ" పొడిపొడిగా అంది.

"నా పేరేంటో అడగరా?"

"ఎందుకులెండి మీ పేరు సూట్‌కేసుపైన వుందిగా పవన్‌కుమార్ అని."

"అబ్బో... ఫర్వాలేదు తెలివైనవారే."

మొదట పొడిపొడిగా మాట్లాడిన సుప్రియ రానురాను బాగానే మాట్లాడింది.

సుప్రియ అన్న చంద్రమోహన్ డాక్టర్, వదిన స్టాఫ్‌నర్స్. వారిది లవ్ మ్యారేజీ. ప్రస్తుతం బెంగుళూరులోనే విక్టోరియా ఆస్పత్రిలో పని చేస్తున్నారు. వాళ్ల నాన్నకు పెన్షన్ జీవనాధారం. అన్నయ్య చంద్రమోహన్ అప్పుడప్పుడు డబ్బులిస్తాడు తల్లిదండ్రులకు. ఉద్యోగం దొరికాక తల్లిదండ్రులను బాగా చూసుకోడం ఆమె ధ్యేయమట. ఇవీ సుప్రియ చెప్పిన వారి ఇంటి విశేషాలు.

ఆడపిల్లలను కదిలించాలేగానీ వసపిట్టలా వాగుతారు అనే పెద్దల మాట నిజమేననిపించింది.

"మీ పెళ్లి అయినాక మీ ఆయన మీ తల్లిదండ్రులకు డబ్బులివ్వడానికి అడ్డు చెబితే అప్పుడేం చేస్తారు?" ఏమంటుందో చూద్దామని అడిగాను.

పెళ్లి మాట వినగానే సుప్రియ సిగ్గుల మొగ్గయింది. చెక్కిళ్ళు గులాబీలయ్యాయి.

"భర్తను ఆ మాత్రం ఒప్పించలేకపోతానా?" అంది.

మొత్తానికి సుప్రియ గట్టిదేననుకున్నాను.

మామధ్య చాలా కబుర్లు దొర్లాయి. ఇంతలో బెంగుళూరు వచ్చేసింది. ఇక వాళ్ళ అన్నయ్య వాళ్లింటికి ఆమెను చేరిస్తే మా మధ్య బంధం తెగిపోతుంది. ఆ తరువాత నేనెవరో? ఆమెవరో? ఆటోలో వాళ్ళ అన్నయ్య వాళ్ల ఇంటికి వెళ్లాము. ఇల్లు తాళంవేసి వుంది. ఆరా తీస్తే వాళ్ళు గోవా టూర్‌కు వెళ్లారని తెలిసింది. ఈ వార్త తెలియగానే సుప్రియ ముఖం వాడింది.

"ఇప్పుడేం చేసేదండీ" అంది సుప్రియ కంగారుగా.

"మరేం భయంలేదులే. మా అక్కావాళ్ళు జెపినగర్‌లో వున్నారు. అక్కడికెళదాం" అన్నాను.

ఆటోలో మా అక్కా వాళ్లింటికి వెళ్లాం. పెద్దగా టీవీ వినబడుతోంది. ముగ్గురు, నలుగురు ఆడవాళ్ళు టీవీ చూస్తున్నారు. మమ్మల్ని చూడగానే వాళ్ళు ఆ హాలుకు ఆనుకునివున్న గదుల్లోకి వెళ్లిపోయారు. వాళ్లెవరో నాకు తెలియదు. స్నేహితులా? చుట్టాలా? ఏమో అక్కను అడిగితే చెప్పదా అనుకున్నాను. ఇంతలో లోపలి గది నుండి హాల్లోకి వస్తున్న మా అక్క కనిపించింది.

"ఏరా పవన్ బాగున్నావా? అమ్మానాన్నా బాగున్నారా?" నన్ను చూడగానే క్షేమసమాచారాలడిగింది.

"అంతా బాగున్నారక్కా. బావగారేరీ? గదుల్లోకి వెళ్లారే ఆ ఆడపిల్లలెవరు?" అని అడిగాను.

నేనడిగిన ప్రశ్నలకు అక్క ఎందుకో గాబరా పడింది.

"అన్న తిందురుగానీ రండి. ఇప్పటికే ఆలస్యమైంది" అంటూ వంట గదికేసి దారి తీసింది.

నా వెంటనున్న సుప్రియను చూసి కూడా ఆ అమ్మాయి ఎవరని అక్క అడగనందుకు నాకు ఆశ్చర్యమేసింది. నాకూ, సుప్రియకూ వద్దు వద్దంటున్నా అక్క కొసరి కొసరి వడ్డించింది.

"మిద్దెపైన ఒక గది వుంది. అక్కడ అన్ని సౌకర్యాలూ ఉన్నాయి. అక్కడ మీరిద్దరూ పడుకోండి. ఉదయం మిగిలిన విషయాలు మాట్లాడుకుందాం" అంటూ మిద్దెపైకి దారి తీసింది.

"ఎందుకక్కా? క్రింద ఇన్ని గదులున్నాయికదా. నేనొక గదిలో, సుప్రియ ఒక గదిలో పడుకుంటాం" అంటున్నా నా మాటలు అక్క వినిపించుకోలేదు.





## అందివచ్చిన అదృష్టం

తలచినదే జరిగినదా దైవం ఎందులకు? అని పాడుకుంటున్న వెటరన్ తారల్ని చూ రక్షిత నవ్వుకుంటోంది. చూపులతో గుచ్చేసే అందాలభామ ఇప్పుడు టాలీవుడ్‌లో టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారిపోయింది. పూరీ జగన్నాథ్‌కి ఇష్టురాలైన రక్షితకి ఆఫర్లు బాగానే వస్తున్నాయి. రవితేజ 'ఇడియట్'తో టాలీవుడ్ కొచ్చిన రక్షిత ఇప్పుడు టాప్ హీరోల సరసన నటించే ఛరిష్మాని సొంతం చేసుకుంది. నాగార్జునతో కలిసి 'శివమణి', ఎన్టీఆర్‌తో కలిసి 'ఆంధ్రావాలా'లో నటిస్తున్న రక్షిత మళ్లీ జూనియర్ ఎన్టీఆర్ సరసన 'సాంబ'లో హీరోయిన్ ఛాన్స్ కొట్టేసింది. ఆది, దిల్, తాజాగా ఠాగూర్ వంటి హిట్ చిత్రాలందించిన వి.వి.వినాయక్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం కూడా హిట్ అయితే ఆమె టాలీవుడ్‌లో మంచి డిమాండ్ ఉన్న నటిగా మారిపోతుందంటున్నారు. ఇండస్ట్రీలోకొచ్చిన కొద్దికాలంలోనే మంచి చిత్రాల్లో నటించిన రక్షిత అదే ఊపుతో ముందుకి సాగుతోంది.

"ఉదయం ఆరుగంటలకు కాఫీ తీసుకొస్తా. అంతవరకూ క్రిందికి దిగి రాకండి'' అది అభ్యర్థన కాదు, ఆజ్ఞలా వుంది. పిల్లాజెల్లాలేని వీరికెందుకింత పెద్ద ఇల్లు? ఆ ఆడపిల్లలెవరు? క్రింది గదుల్లో పడుకోనీయకుండా మిద్దెపై గదిలో ఎందుకు పడుకోమంది? ప్రశ్నలన్నీ వదిలి సుప్రియ చుట్టూ నా ఊహలు అల్లుకోసాగాయి. పాపం ఆ అమ్మాయికిది కొత్త చోటు. ఉన్నదొక గది. వయసులో వున్నవారం ఇద్దరం ఈ గదిలోనే పడుకోవాలి. తను ఎంత ఇబ్బంది పడుతోందో నాకర్థమవుతూనే వుంది.

"సుప్రియా! టీవీ చూస్తావా?'' జవాబుకోసం ఎదురు చూడకుండా టీవీ ఆన్ చేసాను.

"సుప్రియా! ఎంతసేపలా నిల్చుంటావు కూర్చో.''


"మనం ఉదయం పదిగంటలకే వెళ్లిపోదామా? ఇంటర్‌వ్యూ రెండుగంటలకు కదా?''

"మీ అన్నయ్య వాళ్ళు వుండి వుంటే బాగుండేదికదూ?''

ఎన్ని ప్రశ్నలడిగినా సుప్రియ జవాబు చెప్పడం లేదు. నాకు కాస్త కోపం వచ్చింది.

"సుప్రియా అనేకంటే ప్రియా అంటే బాగుంటుంది కదా. ప్రియా! ఎందుకలా బెదురుతున్నావు? నేనేం పెద్దపులిని కాదు. ఒక ఆడా మగా ఒక గదిలో కలసివున్నంత మాత్రాన ఏమవుతుంది? కాలం మారింది. ఈనాటి స్త్రీలు ఎంతో ప్రగతిని సాధిస్తున్నారు. నీవిలా మంచంపై పడుకో. నేను నేలమీద పడుకుంటాను'' అంటూనే దిండు దుప్పిటి తీసుకుని నేలపై పడుకున్నాను. ఎంతకూ నిద్ర రావడం లేదు. ఉన్నట్టుండి పోలీసు ఈలలు వినిపించాయి. కుక్కలు మొరగడం ప్రారంభించాయి. క్రింద ఎవరో పరుగెడుతున్నారు. దబదబమని బూట్ల శబ్దాలు వినిపిస్తున్నాయి. ఉలిక్కిపడి లేచాను. ప్రియ వైపు చూసాను. ఎప్పుడు లేచిందో ఆమె కళ్లల్లో భయం ప్రస్ఫుటంగా కనిపించింది. గడియపెట్టని మా గది తలుపులు తోసుకుంటూ యమభటుల్లాఇద్దరు పోలీసులు లోపలికొచ్చారు.

"ఏయ్ లేవవే, రేయ్ లేవరా'' అంటూనే ఏవో బూతులు మాట్లాడారు.




నా నోట మాట రావడంలేదు. హడావుడిగా లేచాను.ప్రియ గట్టిగా ఏడుస్తున్నది.

"సార్! ఏంటలా మాట్లాడుతున్నారు. మేమేం తప్పు చేసాం?'' అన్నాను.

"ఏడిస్తే వదులుతామనుకున్నావేమో? ముందా ఏడుపాపు. ఏంట్రా ఏ తప్పు చేయలేదా? మర్యాదగా పదండి స్టేషన్‌కు.''

"సార్! మేము ఇంటర్‌వ్యూ...''

"కథలన్నీ స్టేషన్‌లో చెబుదురుగానీ. లాఠీ దెబ్బలు తినకుండా పదండి.''.

అలా మాతోపాటు ఐదుమంది ఆడవాళ్ళు, ఐదుగురు మగవాళ్ళు అరెస్టయ్యారు. అందరినీ పోలీసు వ్యాన్ ఎక్కించారు. చివరగా వ్యానులో ఎక్కింది మా అక్క. అందరినీ రెండు లాకప్ గదుల్లో ఉంచారు. జరిగిందంతా ఓ పీడకలలా వుంది. ప్రియను సంభాళించడం కష్టమైపోయింది.

మా బావ శ్రీనివాసులకు ఏ ఉద్యోగమూ లేదుట. బ్రోతల్ హౌస్ నడుపుతున్నాడట. మా అక్క ఇటు భర్తతో ముడిపడ్డ బంధం తెంచుకోలేక, అటు పుట్టింటికి వెళ్లడానికి ముఖం చెల్లక బావ ఆడించినట్లుగా ఆడుతున్నదట.

మా అక్కను నేనడగాలనుకున్న ప్రశ్నలకు ఈ విధంగా జవాబులు దొరికాయి. అక్క చిక్కుకున్న పరిస్థితులకు జాలిపడ్డాను. ఇకముందు అక్క జీవితం ఎన్ని మలుపులు తిరగనుందోనని బాధపడ్డాను. తొమ్మిదిగంటల ప్రాంతంలో ఎస్ఐ మమ్ములను విచారించాడు. అందరూ తమ నేరాలు అంగీకరించారు. మాకే పాపం తెలియదని, ఎంత చెప్పినా మా మాటలు ఎస్ఐగారు నమ్మలేదు. మా అందరిపై ఎఫ్ఐఆర్ వ్రాసారు. అప్పుడొచ్చారు సిఐగారు. మనిషి ఆజానుబాహువు. ముఖమంతా భయంకరంగా స్ఫోటకం మచ్చలు. పొడవైన మెలితిప్పిన మీసాలు. చూడడానికి సినిమాలో విలన్‌లా ఉన్నాడు. సిఐగారి విచారణలో బస్సులో ప్రియ పరిచయం కావడం మొదలుకుని అప్పటివరకూ జరిగిందంతా చెప్పాను. ఆయన వెంటనే డైమండ్ కంపెనీకి ఫోన్ చేసి మాకు ఇంటర్‌వ్యూ వున్నదీ లేనిదీ విచారించారు.

"ఓకే మిస్టర్. మీరు చెప్పింది వాస్తవమే. కాదనను. కానీ మీతోపాటు అరెస్టయిన వారంతా పాతకాపులే. మీరూ అలాంటి కేసే అనుకున్నారు పోలీసులు. చట్టప్రకారం ఎఫ్ఐఆర్ వ్రాసారు. ఇప్పుడేం చేయగలం?'' అన్నాడాయన.

"అలా అనకండి సార్. బ్రతుకు తెరువుకోసం ఉద్యోగాలకోసం వచ్చాం. ఒకసారి కోర్టులో ఫైన్ కడితే ఈ లోకం మేమేదో తప్పు చేసామని అంటుంది. మా భవిష్యత్తు ఏం కాను? ఇళ్లకు ఏ ముఖం పెట్టుకుని వెళ్లగలం. మీరు కాస్త ఆలోచించండి సార్'' అన్నాను వినయంగా.

సిఐగారు మా మాటలు వింటూ ఏదో ఆలోచిస్తున్నట్లు కనిపించారు. మధ్యలో ఎవరికో ఫోన్ చేసి మాట్లాడారు. ఒక పోలీసును పిలిచి ఏదో చెప్పి పంపించారు. ఆయన పనితీరు చూస్తుంటే ఆయనపై నాకు నమ్మకం పెరిగింది. ఏదో దారి చూపించకపోతాడా అన్న ఆశ కలిగింది.

"నీవు చెప్పింది రైటేనయ్యా. నీవు మగవాడివి. ఏం జరిగినా తట్టుకోగలవు. ఈ అమ్మాయి సంగతి ఏం చేద్దాం. నా సర్వీసులో ఇలాంటి కేసే ఒకటి తగిలింది. వారు ప్రేమించుకున్నారు కనుక వారికి పెళ్లి జరిపించి పంపేసాను. కానీ మీ కేసు అలాంటిది కాదే. పోనీ ఆమె మెడలో తాళిబొట్టు వేసుకోమందాం. జడ్జిగారు అడిగినప్పుడు మీరు భార్యాభర్తలమని చెప్పండి. రుజువుగా తాళిబొట్టును చూపండి. భార్యాభర్తలన్నాక ఇక బ్రోతల్ హౌస్ అయితేనేమి, లాడ్జి అయితేనేమి, మరెక్కడ అయితేనేమి అది అపరాధమని ఎవరూ చెప్పలేరుకదా" అన్నారు సిఐగారు.

ఏదో విధంగా ఈ కేసు నుండి బయటపడితే చాలనుకుని ప్రియ ఏం చెబుతుందా అని చూసాను.

"ఉత్త తాళి మెడలో వేసుకోవడమేకదమ్మా. కోర్టు నుండి బయటపడ్డాక తాళి తీసేస్తే సరిపోతుంది" అన్నారు సిఐగారు మళ్లీ.

"సరే తాళి తెప్పించండి."

ప్రియ నోటివెంట ఆ మాట రావడం ఆలస్యం వెంటనే వంద రూపాయలు తీసి సిఐగారికిచ్చాను. నిముషాల్లో ఒక పోలీసు వెళ్లి రోల్డ్‌గోల్డ్ చైన్ ఒకటి తెచ్చాడు. దాని మధ్యలో తాళిబొట్టు వుంది.

"ఇందు. ఈ చెయిను మెడలో వేసుకోమ్మా" అన్నారు సిఐగారు.

"మెడలో వేసుకున్నంతమాత్రాన పవన్‌గారి భార్యనవుతానా సార్. కోర్టులో భగవద్గీతపై ప్రమాణం చేసి అబద్ధం ఎలా చెప్పగలను సార్. పవన్‌గారిని నా మెడలో తాళి కట్టమని చెప్పండి. అప్పుడు ధైర్యంగా జడ్జిగారితో మేం భార్యాభర్తలమని చెబుతాను" అంది ప్రియ.

ఆ మాట వినగానే నాకు ఏనుగెక్కినంత సంబరమైంది. అది వుత్తిత్తి పెళ్ళే అగుగాక. ప్రియ నా భార్య అవుతుంది.

ఈసారి పసుపుతాడు తెప్పించారు సిఐగారు. పసుపుతాడు ప్రియ మెడలో కట్టేశాను. పోలీసు స్టేషను నుండి రెండు జీపులు బయలుదేరాయి కోర్టుకు. బోనులో నిలబడి నేరం ఒప్పుకుంటూ, వేసిన ఫైన్ కట్టేసి వెళ్లిపోయారందరూ. మా అక్కకు బ్రోతల్ హౌస్ నడిపినందుకు మూడు నెలల జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధించడం చూసి నా కళ్ళు చమర్చాయి. ఇక నేనూ ప్రియ మిగిలాం. బోనులో ప్రియ నిల్చుంది.

"ఏవమ్మా! నీవు చేసిన నేరం అంగీకరిస్తున్నావా?" అడిగారు జడ్జి ప్రియని.

"నేరమా? నేనేం నేరం చేసాను సార్?" ఆశ్చర్యంగా అడిగింది ప్రియ.

"మరెందుకు బోనులో నిలబడ్డావమ్మా?"

"నేనెందుకు నిలబడతాను సార్. మేం భార్యాభర్తలమని మొత్తుకుంటున్నా ఈ పోలీసులు నమ్మక అనవసరంగా మమ్మల్ని లాక్కు వచ్చారు."

"వ్వాట్? మీరు భార్యాభర్తలా?"

"నా మెడలో వున్న ఈ తాళి చూడండి సార్. ఇది తాళి కాదంటారా? స్వయంగా నా భర్త పవన్‌గారు కట్టారు. మేం ప్రేమించి పెళ్లాడాం."

"ఏమయ్యా ఈవిడ నీ భార్యా? మరెందుకున్నారు బ్రోతల్ హౌస్‌లో?"

"అది మా అక్కా వాళ్ల ఇల్లు సార్. ఇంటర్‌వ్యూ కోసం వచ్చాం. అక్కగారి ఇల్లు వుంచుకుని లాడ్జికెలా వెళ్లగలం? వారేం చేస్తున్నారో నాకెలా తెలుస్తుంది సార్?" అన్నాను.

కోర్టు మా ఇద్దరినీ నిర్దోషులుగా ప్రకటించింది.

మా ఆనందానికి హద్దులేకుండా పోయింది. కోర్టు బయట సిఐగారికి కృతజ్ఞతాపూర్వకంగా నమస్కరించాము. ఆయన మా కంటికి దేవుడల్లే కనిపించాడు.

"ఇక వెళ్లొస్తా ప్రియా. ఇంటర్‌వ్యూకు టైమైంది. బస్ క్యాచ్ చేయాలి" అన్నాను ప్రియ కూడా నాతో వస్తానంటుందనే ఆశతో.

"అవును. ఇక ఎక్కడికి వెళ్లాలన్నా నా పర్మిషన్ అవసరమే కదా" నవ్వుతూ అంది ప్రియ.

ప్రియ ఏమంటున్నదో నాకు అర్థం కాలేదు. నాతోపాటు ఇంటర్‌వ్యూకు వస్తానందా? రానందా? అయోమయంగా ఆమెవైపే చూసాను.

"అదే.. ఆ వెర్రిచూపులొద్దు. భార్య పర్మిషన్ లేకుండా భర్త ఎక్కడికి వెళ్లినా శుభం కాదు అంటున్నా."

అప్పుడు వెలిగింది నా మెదడులో బల్బు. నేను తాళి కట్టిన ముహూర్తం బాగుంది. నా అదృష్టం బాగుంది. ప్రియ నా ఇల్లాలే. సంతోషం ఆపుకోలేక పోయాను.

ప్రియను నా కౌగిలిలో బంధించాను. అది కోర్టు ఆవరణ అని కూడా గుర్తుకు రాలేదు. పబ్లిక్ ప్లేస్‌లో భార్యనైనా ముద్దు పెట్టుకోవడం నేరమనే విషయమూ స్ఫురణకు రాలేదు. నా తెలిసిందల్లా నా స్వప్నసుందరి నాకు దక్కిందనే.

"తంతే గారెల బుట్టలో పడ్డావయ్యా. ప్రియ నీతో తాళి కట్టించుకున్నప్పుడే ఆమె ఆంతర్యం నాకు బోధపడింది. ఇక ప్రొసీడైపో" అన్నారు సిఐగారు.

నేనూ, ప్రియ సిఐగారి కాళ్లకు నమస్కరించాము. ఆయన ఆశీర్వాదం అందుకుని చేయీ చేయీ కలుపుకుని ఇంటర్వ్యూకు బయలుదేరాం.

★

## ఆమె అంటే అద్దానికి భయం!

అమెరికాలో ఫిలడెల్ఫియాకు చెందిన లిపి మెనికిల్ అనే మహిళకు ఓ విచిత్రమైన శక్తి ఉందండీ. ఆమె అలా అద్దం ముందు నిలుచుంటే చాలు, ఎంత పెద్ద అద్దమయినా, ఎంత మందంగా ఉండే అద్దమైనా భళ్లున ముక్కలవ్వలసిందే. టీవీ ముందుకి వస్తే టీవీ స్క్రీన్ ఢాం అంటుంది. కారెక్కితే ముందూ, వెనక అద్దాలు ఫట్... అద్దంలో చూసుకునే అదృష్టం ఈమెకు లేదు. ప్రత్యేకించి ఈమెను చాలాసార్లు చాలా మంది పరిశోధక బృందం పరిశీలించడం జరిగింది కానీ కారణం ఏమిటన్నది ఈ రోజుకీ అంతుచిక్కని రహస్యంగానే మిగిలింది.

## కలియుగ గాంధారి

రెండో నివాసి అయిన లిమోంటెనాకు 59 ఏళ్లు. ఆమె భర్త గెరార్డో అర్చినా కెపరస్ రైతు. ఆయన వయస్సు 60 సంవత్సరాలు. వీళ్లిద్దరికీ అర్జెంటీనాలో వివాహం జరిగింది. ఈ దంపతులకు అనేకసార్లు కవలలు, కొన్ని సందర్భాలలో ఒకే కాన్పులో ముగ్గురేసి పిల్లలు కలిగారు. వీరి 73 మంది పిల్లల్లో 61 మంది బ్రతికి ఉన్నారు. వీరిలో ఆఖరికి కవలలకు 6 మాసాలు. మైగాడ్ ఒక్కరితోనే వేగలేక చస్తున్న రోజులివి. వీళ్లెలా వేగుతున్నారు.

## గోడ టీవీ

గోడకు తగిలించే టెలివిజన్ తయారు చేయడానికి ప్రపంచంలో పలుచోట్ల పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ టెలివిజన్‌కు స్క్రీన్ కొరియాలోని శ్యామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ తయారు చేసింది. 17.2 ఇంచీల థిక్ ఫిల్మ్ ట్రాన్సిస్టర్ లిక్విడ్ క్రిస్టల్ డిస్ప్లేను తయారుచేశారు. దీనిలో చాలా ఉపయోగాలున్నాయి.

-శ్రీ

